క్లుప్తంగా

ఈవీఎం పనితీరుపై అవగాహన



వెల్దుర్తిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శివరాముడు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) పనితీరుపై గురువారం స్థానిక తహసీల్దార్ శివరాముడు ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా మండల ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈవీఎం మెషిన్ ఉంచి కార్యాలయాలకు వచ్చిన వారికి ఓటు ఎలా వేయాలో డెమో ద్వారా చూపించారు. అనంతరం స్థానిక పాత బస్టాండులో, పలు ప్రధాన కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాబోవు అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మద్దికెరలో నేడు పింఛన్ల పంపిణీ

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచిందని వీటితో పాటు కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండు వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఇమ్యూనైజేషన్ పక్కాగా చేపట్టాలి

నందవరం: గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇమ్యూనైజేషన్ పక్కాగా చేపట్టాలని పీహెచ్‌సీ డాక్టర్లు రేవతి, శ్రీలత సూచించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీహెచ్ఓ బలరాం, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'గోరుముద్ద' సక్రమంగా అమలు చేయండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న గోరుముద్ద' పథకంలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ–1 సుదర్శన్ రెడ్డి వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. గురువారం స్థానిక స్పెషల్ స్కూల్‌లో స్టాక్ రిజిస్టర్‌తో పాటు బియ్యం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్పీ ఉరుకుంద, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

నందవరం: పదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీచర్ల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ శైలజ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి



పోనకలదిన్నెలో ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని పోనకలదిన్నె, సోమలగూడూరు గ్రామాల్లో సర్పంచ్ పావని ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను పేదల కోసం ప్రవేశపెట్టిందన్నారు. వాటిని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీల గురించి వివరించారు. ఏఓ మద్రి స్రవంతి, ఎంఈఓ–2 రఘునాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- పెన్షన్ సొమ్ము పెంపుతో లబ్ధిదారులకు భరోసా
- గోనెగండ్లలో నూతన పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి



కటికె రసూల్‌బీకి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. గోనెగండ్ల మండలంలో 179 మందికి కొత్తగా పింఛన్లు మంజూరుకాగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, ఎంపీపీ టీ.నసురుద్దీన్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అవ్వాతాతల సంక్షేమం కోసం పెన్షన్ సొమ్ము పెంచడం హర్షణీయమన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతినెలా 1వ తేదీన తెల్లవారకముందే వారి ఇంటి వద్దకే పింఛను సొమ్ము అందిస్తున్నట్లు గుర్తుచేశారు. తండ్రి ఆశయ బాటలో సీఎం జగన్ వృద్ధులు, దివ్యాంగులకు భరోసా కల్పించేలా పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2024లోనూ ముఖ్యమంత్రిగా గెలుపొందాలని కోరుకుంటున్నారని చెప్పా రు. సీఎం సహకారంతో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గోనెగండ్ల మండలంలో అలువాల, గంజిహళ్లి, పెద్దనేలటూర్, పెద్దమరివీడు గ్రామాల్లో బీటీ రోడ్లు వేశామన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంచడం కోసం,క్రస్ట్ గేట్ల పనులకు ప్రభుత్వం రూ.57.3కోట్లు మంజూరు చేసింది. ఆ పనులు త్వరలో పూర్తవుతాయని పేర్కొన్నారు. దీంతో మరో పదివేల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటి సమస్య తీరనుందన్నారు. జీడీపీ నీటిని ఎల్లెల్సీ నుంచి అలువాలకు పోయే విధంగా తూము ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గంజిహళ్లి, తెర్నేకల్ గ్రామాల మధ్య హంద్రీనదిపై బ్రిడ్జి నిర్మాణానికి సీఎం రూ.43.80 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దేవనకొండ, పత్తికొండ తదితర గ్రామా ల ప్రజలు, రైతులు ఎమ్మిగనూరుకు సులువుగా రాకపోకలు సాగించే అవకాశంతో పాటు రైతులు పండించిన దిగుబడులు మార్కెట్‌కు తరలించి విక్రయించడం ద్వారా అభివృద్ధి చెందుతారన్నారు. సమన్వయకర్త మాచాని వెంకటేష్ మాట్లాడుతూ.. తనను సమన్వయకర్తగా ప్రతిపాదించిన వారందరికీ రుణపడి ఉంటానని, ఎల్లప్పుడూ ఎర్రకోట కుటుంబానికి విధేయుడిగానే ఉంటానని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, చికెన్‌రాజా, వెంకటేశ్వర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, మునెప్ప, మాబువలి, ధర్మకారి నాగేశ్వర రావు, నదిముల్లా తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

- వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- రూ.3 వేల పింఛన్ పంపిణీపై లబ్ధిదారుల హర్షం



హాజరైన పెన్షన్ లబ్ధిదారులు

పత్తికొండటౌన్: వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని, అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ హయాంలో పెన్షన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారని, రోజులు తరబడి తిప్పుకునేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రతినెలా 1వ తేదీన లబ్ధిదారుల ఇళ్లవద్దకే పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. మండలంలో 8793 మందికి పెన్షన్లు అందుతున్నాయని, వారికి ప్రభుత్వం ప్రతినెలా రూ.2.64 కోట్లు పింఛను పంపిణీ చేస్తోందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.3 వేలు పెన్షన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అన్నారు. ఎంపీడీఓ కవిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురా లు ఉరుకుందమ్మ, ఎంపీపీ ఎం.నారాయణదాసు, సర్పంచ్ కొమ్ముదీపిక, నాయకులు టీఎండీ హుసే న్, సోమశేఖర్, భాస్కర్ నాయక్, నాగరాజు, నీలకంఠ, నెట్టేకల్లు, కృష్ణారెడ్డి, శ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, రంగానాయక్, తదితరులు పాల్గొన్నారు.



హొళగుందలో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి



సిరాలదొడ్డికి చెందిన పుల్లమ్మకు కంబాలపాడుకు వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ హనుమంతు



అల్లుగుండులో పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాంరెడ్డి



దైవందిన్నెలో మేరికంటి మరియమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజ్‌కుమార్



వెల్దుర్తిలో వలంటీర్ శివకుమారి రూ.3 వేల పింఛన్ ఇవ్వడంతో బోసి నవ్వులు చిందిస్తున్న వృద్ధురాలు ఎల్లమ్మ

పింఛన్.. సంతోషం పెంచెన్

ఆలూరు: గతంలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అనేక ఇబ్బందులకు గురయ్యే వారని ఆ బాధలను చూడలేక ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్ సొమ్ము అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. గురువారం హొళగుందలో లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్‌ను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకారం తేదీలు ప్రకటించి అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. జగనన్న పాలనలో మేలు జరిగి ఉంటేనే రానున్న ఎన్నికల్లో మరోసారి ఓటు వేసి గెలిపించాలని కోరారు. త్వరలోనే మార్లమడికి గ్రామానికి తారు రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, కుమారస్వామి, మల్లికార్జున, కోగిలతోట శేషప్ప, మల్లికార్జున, కెంచప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను, సీఎం అందించిన సందేశ కరపత్రాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాంరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో 165 మందికి పింఛన్ల పెంపు జరిగినట్లు తెలుపుతూ, ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మిగనూరురూరల్: మండలలోని కడిమెట్ల గ్రామానికి చెందిన పుల్లమ్మ కృష్ణగిరి మండలం కంబలపాడు గ్రామంలోని కుమార్తె దగ్గరకు వెళ్లడంతో వలంటీర్ హనుమంతు అక్కడికే వెళ్లి రూ.3 వేల పింఛన్ అందజేశాడు. ఉన్నచోటికే వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు.

ఆలూరు: మండలంలోని మూసానపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగారెడ్డి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. పింఛన్ సొమ్ము రూ.3వేలకు పెంచడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

ఆలూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలుకి పింఛన్ అందించి వలంటీర్ మానవత్వం చాటుకున్నాడు. ఆలూరు పట్టణానికి తిక్కమ్మ రెండు వారాలుగా ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక సచివాలయం–3 పరిధిలోని వలంటీర్ నవీన్ గురువారం ఆదోనికి వెళ్లి తిక్కమ్మకు పింఛన్ అందించాడు. అనారోగ్యంతో బాధపడుతూ.. ఆర్థిక పరిస్థితులు సరిగాలేని సమయంలో రూ.3 వేల పెన్షన్ అందించడంపై వృద్ధురాలు తిక్కమ్మ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపింది. పింఛన్ పంపిణీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిన వలంటీర్‌ను ఎంపీడీఓ అల్లబకష్ అభినందించారు.



ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిక్కమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ నవీన్

ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

నందవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాల పరిశీలన ముమ్మరం చేశారు. గురువారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో పోలింగ్ బూత్‌లు–48, 50, 51లను సెక్టోరియల్ అధికారి, వైకేపీ ఏపీఎం చిన్న వీరన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను తనిఖీ చేశామన్నారు. విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపులు, తాగునీరు, టాయిలెట్లు వంటి సౌకర్యాలను పరిశీలించామని వివరించారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ గురుస్వామి, ఏఎస్ఐ చంద్రశేఖర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.



పోనకలదిన్నె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి చిన్న వీరన్న

నేటి పింఛన్ పంపిణీ కార్యక్రమం వాయిదా

మద్దికెర: మండలంలో శుక్రవారం జరగవలసిన వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, జెడ్పీటీసీ మురళీధరరెడ్డి గురువారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అత్యవసర సమావేశానికి వెళుతున్నందువల్ల కార్యక్రమం రద్దు చేసినట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

క్రీడాదుస్తుల పంపిణీ

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన టీషర్టులు, టోపీలను గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో సత్తా చాటి మండలస్థాయికి ఎంపికైన క్రీడకారులకు ప్రభుత్వం టీషర్టులు, టోపీలను పంపిణీ చేసిందన్నారు. మండల స్థాయిలో ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈఓఆర్డీ నాగేష్, ఏఓ బాబు భాస్కర్, ఈఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, ఉసేన్, ఈరన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నందవరం: మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో శుక్రవారం 'వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

117 కొత్త పింఛన్లు మంజూరు

ఆస్పరి: మండలంలోని ఆయా గ్రామాలలో 117 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఏంపీడీఓ రాణెమ్మ గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మంజూరైన పింఛన్లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల సొసైటీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొనాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు.

నేడు సురక్ష వైద్య శిబిరం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సచివాలయం–1 పరిధిలో శుక్రవారం జనగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్‌లో వైద్య శిబిరం ఉంటుందని, సంబంధిత సచివాలయ పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. డీడీఓగా రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారి వ్యవహరించనుండగా, స్పెషలిస్టు వైద్యులు, కంటి వైద్య నిపుణులు చికిత్సలందిస్తారని తెలిపారు.

దాతల సాయం.. నిలుపుతుంది ప్రాణం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక రామళ్లకోట రోడ్డులో ఐదు రోజుల క్రితం వాకింగ్ వెళ్లి తిరిగి వస్తున్న గుడిశె రామలింగప్పను బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. ప్రస్తుతం కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాత బస్టాండులో దోసెల బండితో జీవనం సాగించే రామలింగప్ప చికిత్సకు పట్టణానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ, జర్నలిస్టు సంఘం, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, పోలీసులు, ఉపాధ్యాయులు గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. క్షతగాత్రుడి చికిత్సకు మరింత ఖర్చవుతోందని, దాతలు స్పందించి అతని కుమారుడు దిలీప్ 9014139037 నంబరుకు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా సాయం అందించాలని కోరుతున్నారు.



కర్నూలులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుడిశె రామలింగప్ప

పశువులకు గాలికుంటు టీకాలు

హాలహర్వి: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు గ్రామ పశువైద్యాధికారి వీరకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో పాడి పశువులకు టీకాలు వేశారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం, నోటి నుంచి చొంగ, నోటిలో పండ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు అని వివరించారు. ఈ లక్షణాలు ఉన్న పశువులను యజమానులు ఆస్పత్రికి తీసుకొస్తే టీకాలు వేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తానయ్య ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని జీఎర్రగుడిలో వెలసిన మస్తానయ్య స్వామి ఉరుసు ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున పూలతో అలంకరించిన షంషీర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో వీధుల్లో ఊరేగింపు చేశారు. గ్రామస్తులు స్వామికి చక్కెర చదివింపులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి తమ కోర్కెలు నెరవేరేలా చూడాలని మొక్కుకున్నారు.



జీ.ఎర్రగుడిలో మస్తానయ్యస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

హొళగుంద: మండల కేంద్రంతో పాటు గజ్జహళ్లి తదితర గ్రామాలలో గురువారం శ్రీరామ భక్తులు ఇంటింటికీ తిరిగి అయోధ్య రామ మందిరం చిత్రపటం, అక్షింతలు అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం పురస్కరించుకుని ప్రతి ఇంట్లో 5 దీపాలు వెలిగించి, శ్రీరాముడి చిత్రపటానికి అక్షింతలు వేసి పూజలు చేయాలన్నారు.

హాలహర్వి రామాలయానికి చేరుకున్న అక్షింతలు

హాలహర్వి: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి మండలకేంద్రమైన హాలహర్విలోని రామాలయానికి స్వామివారి అక్షింతలు గురువారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వహిందూ పరిషత్ సంఘం కార్యదర్శి నల్లన్న ఆధ్వర్యంలో అక్షింతలను ఉంచి పూజలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో హిందువులందరికీ అక్షింతలు అందజేస్తామని చెప్పారు. ఆర్ఎస్ఎస్ మండల కార్యదర్శి బసవరాజు, పూజారులు సీతారాం, గిరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య గంధోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక కొలంబావి వీధిలోని పెనుగొండ బాబయ్య గంధోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా పెనుగొండలోని బాబా ఫక్రుద్దీన్ ఉరుసు పురస్కరించుకుని నిర్వహించిన గంధోత్సవంలో భాగంగా అశ్వం, పూల దట్టీలు, పకీర్ల సందడితో నిర్వాహకులు ఫక్రుద్దీన్, తనయులు, భక్తులు గంధం తలకెత్తుకుని పట్టణంలో ఊరేగింపుగా వీరన్నగట్టు కొండ వద్ద గల బాబయ్య దర్గా వద్దకు సాగారు. అక్కడ ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. డాక్టర్ అమీర్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ మండల కన్వీనర్ గట్టు ఆరిఫ్, మహబూబ్‌బాషా, బషీర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి పట్టణంలో పెనుగొండ బాబయ్య గంధోత్సవం ప్రారంభ దృశ్యం

చెప్పినవన్నీ చేస్తున్నాం

- రూ.6.50 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి
- గత టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం
- డిప్యూటీ సీఎంగా హోదాలో ఉన్నా అభివృద్ధి చేయలేదని ఎద్దేవా



దూదేకొండ- కొత్తపల్లి రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: ఎన్నికల హామీల్లో భాగంగా చెప్పినవన్నీ చేసి చూపుతున్నామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధిని చూస్తారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని దూదేకొండ-కొత్తపల్లి గ్రామాలకు రూ.6.50 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. దూదేకొండకు చేరుకున్న ఆమెకు సర్పంచ్ ముజుబుర్ రహిమాన్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆ రోడ్డులో నిర్మించిన బ్రిడ్జిలను పరిశీలించారు. కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల పక్షపాతి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కొత్తపల్లి గ్రామానికి పక్కనే రిజర్వాయర్ నిర్మాణం జరిగిందన్నారు. దీంతో చుట్టుపక్కల వేలాది ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామానికి రూ.6.50 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రోడ్డు కూడా వచ్చిందన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ.50 లక్షలతో ఇంటింటికీ కుళాయి, ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటుచేసి త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గత టీడీపీ హయాంలో ఇక్కడి పాలకులు డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నా నియోజకవర్గంలోని గ్రామాలను ఏ మాత్రం అభివృద్ధి చేయలేకపోయారన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓట్ల కోసం నాటకాలు చేస్తున్నారని, ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎంపీపీ నారాయణదాస్, వైస్ ఎంపీపీ బలరాముడు, ఎంపీటీసీ ఈరన్న, నాయకులు పులికొండ తిప్పయ్య, సోమశేఖర్, టీఎండీ హుసేన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.